www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 16 అక్టోబర్ 2023
5



వైఎస్ఆర్

మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం 284 పరుగులకు ఆలౌట్

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ - 23 మెన్ మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా ఆదివారం కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన మ్యాచ్‌లో అనంతపురం జట్టు 8 వికెట్ల నష్టానికి 284 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 76.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని రోహిత్ రోషన్ 60 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని సజ్జాన్ బాష 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన కర్నూలు జట్టు మొదటి రోజు ఆట ముగిసిన సమయానికి 12.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 26 పరుగులు చేసింది. **చిత్తూరు జట్టు 219/10...** కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్ లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 48.3 ఓవర్లలో 219 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని తేజ రెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ లో రాణించి 126 పరుగులు (సెంచరీ) చేశాడు.

నాకు రాజకీయ గురువు షేక్ హుసేన్

పురస్కార ప్రదానోత్సవ సభలో డిప్యూటీ సిఎం



షేక్ హుస్సేన్‌కు కేతు విశ్వనాథరెడ్డి స్మారక జీవితపురస్కారం అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి

ప్రజాశక్తి - కడప అర్బన్

తనకు రాజకీయ గురువు షేక్. హుసేన్ సత్యాగ్ని అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్ బాషా అన్నారు. తనకు సాహిత్యంతో ఏమాత్రం సంబంధం లేకపోయినా తన గురువుకు జీవిత సాఫల్య పురస్కారం ఇవ్వాలనే తపనతో సభలో పాల్గొంటున్నానని అన్నారు. ఆదివారం స్థానిక ఐఎంఎ హాలులో జరిగిన కేతు విశ్వనాథ రెడ్డి స్మారక జీవన సాఫల్య పురస్కార సభలో ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కవిత విద్యా సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ జీవిత సాఫల్య పురస్కారాన్ని షేక్ హుసేన్ సత్యాగ్నికి అందజేశారు. యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ కేతు విశ్వనాథ రెడ్డితో తాను ఒక సాహిత్య సభలో వేదిక పంచుకున్నానని, ఆ సభలోనే ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో తనకు తెలిసిందన్నారు. షేక్ హుసేన్ సత్యాగ్ని తనకు రాజకీయాల్లో తొలి నుంచి మంచి ప్రోత్సాహం ఇచ్చారని వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తనను అనేక సార్లు ఆయన వద్దకు తీసుకెళ్లి ఒక గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. కేతు విశ్వనాథ రెడ్డి జీవితం- సాహిత్యం అనే అంశంపై కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్ మాట్లాడుతూ సాధారణంగా రచయితలు వ్యక్తులుగా కన్నా వారి రచనలు గొప్పగా ఉంటాయని, ఎక్కడో నూటికొకరు మాత్రమే రచనల కన్నా వ్యక్తిగా గొప్పవారు ఉంటారని చెబుతూ, కేతు విశ్వనాథ రెడ్డి రచయితగా ఎంత గొప్పవారో వ్యక్తిగా అంతకన్నా గొప్పవారని అన్నారు. కథా రచయిత వేంపల్లె షరీఫ్ మాట్లాడుతూ సాహిత్యంలో మైనార్టీ, దళిత, స్త్రీ వాదాలు అనేవి ఏర్పడక ముందే ముస్లిం జీవితాల గురించి రాసిన రచయిత సత్యాగ్ని అని అన్నారు. పురస్కార గ్రహీత తన స్పందనను తెలియజేస్తూ తనకు గురుతుల్యులైన కేతు విశ్వనాథరెడ్డి పేరు మీద ఇస్తున్న జీవిత సాఫల్య పురస్కారం ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు. తనకు శరీరం సహకరించని స్థితిలో ఉన్న సమయంలో కవితా విద్యా సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు పిచ్చయ్య చౌదరి ఈ పురస్కారాన్ని ఇస్తున్నారన్నప్పుడు తనకు ఎంతో ఆనందం కలిగిందన్నారు. ఈ సభలో సాహితీ విమర్శకులు పి. సంజీవమ్మ ఆత్మీయ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిర్వాహకులు అలపర్తి పిచ్చయ్య చౌదరి, దుర్గా కుమారి మాట్లాడుతూ కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ తరపున చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన పెద్దిరెడ్డి నీలవేణి, జి. ఎల్లేశ్వరరావు, ఎస్. ఎమ్. డి బాషా, ముడియం కిషోర్, భూపతి రాయల్‌ను సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సాహితీ అభిమానులు, ఆర్తి హోం విద్యార్థినులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ 'ప్రయివేట్'కు వత్తాసు పలకడం తగదు

- డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యా జమాన్యాలకు జిల్లా విద్యా శాఖ అధికారి వత్తాసు పలుకుతూ వాటికి కొము ్మకాస్తున్నారని డివైఎ ఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గండి సునీల్ కుమార్, సగిలి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం కడపలో దసరా సెలవులలో ప్రయివేట్ ఉపాధ్యాయులకు వర్క్ షాప్ పేరుతో స్కూల్స్ నడుపుతున్న విద్యాసంస్థల వద్ద ఆందోళన నిర్వహించి ప్రయివేట్ ఉపాధ్యాయులను బయటకు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు దసరా సెలవులలో స్కూల్స్ లలో వర్క్ షాప్, స్టడీ హవర్స్, స్పెషల్ క్లాస్, వర్క్ వివిధ రకాల పేర్లతో స్కూల్ రన్ చేయకూడదని ఒకవైపు చెబుతున్నా అది కడప జిల్లాలో వర్తించడం లేదన్నట్లు విద్యా శాఖ అధికారుల వ్యవహార శైలి ఉందని విమర్శించారు. జిల్లాలో యథేచ్ఛగా ప్రయివేట్, కార్పొరేట్ స్కూల్స్ నడుస్తున్నా ప్రయివేట్ ఉపాధ్యాయులకు క్లాసులు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారులు వాటికి కొమ్ముకాయడం సిగ్గుచేటు అన్నారు. వివిధ రకాల పేర్లతో సెలవులలో స్కూల్స్ రన్ చేస్తున్న పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా.నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాహుల్,జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంపల్లి.అజయ్ పాల్గొన్నారు.

'అపుస్మా' రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. రామచంద్రారెడ్డికి జ్యూరీ అవార్డు

ప్రజాశక్తి - కడప అర్బన్



జ్యూరీ అవార్డు అందుకుంటున్న ఎం.వి. రామచంద్రారెడ్డి

ప్రతిష్టాత్మక ఎడ్యుకేషన్ వరల్డ్ గ్రాండ్ జ్యూరి అవార్డు 2023ను ఆంధ్ర ప్రదేశ్ ప్రయి వేట్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన (అపుస్మా) రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి అందుకున్నారు. శనివారం ఢిల్లీలో మారియట్ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ ఏలియన్స్ (నిసా)అధ్యక్షుడు కులభూషణ శర్మ, ఎడ్యుకేషన్ వరల్డ్ ప్రతినిధుల బృందం ఎం.వి.రామచంద్రారెడ్డికి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ అవార్డు అందుకోవడం మరింత బాధ్యత పెరిగిందని, ఈ సంఘాన్ని ఎడ్యుకేషన్ పరంగానూ అలాగే సామాజిక భాద్యతతో అనేక సేవా కార్యక్రమాల్లో ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. తమ వంతు గురుతర బాధ్యతను త్రికరణ శుద్ధిగా నెరవేర్చుతామని రామచంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో అప్పుస్మా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ తులసి విష్ణుప్రసాద్, అడిషనల్ సెక్రటరీ ఎం.వి.ఎస్. శర్మ, కోశాధికారి ఎం.వి.రావు,రాష్ట్ర ఐటీ విభాగం చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఖాశీం, రాష్ట్ర సంయుక్త కోశాధికారి కాటూరి వెంకటేశ్వరరావు కడప, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల అధ్యక్షులు గంగయ్య, బుల్లబ్బాయి, పాపారావు నాయుడు పాల్గొన్నారు.

కులగణనతో సామాజిక విప్లవం తథ్యం

ప్రజాశక్తి-కడప సిటీ



సమావేశంలో మాట్లాడుతున్న బాదుల్లా

కుల గణనతో సామాజిక విప్లవం తథ్యమని ఎంబిసి రాష్ట అధ్యక్షులు సుంకేసుల బాదుల్లా పేర్కొన్నారు . ఆదివారం ఆయన స్థానిక ఎంబిసి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుల గణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం ముదావహమన్నారు. బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను రాజకీయంగా అందలం ఎక్కించిన ఘనతను దక్కించుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే బిసి కులాల వారీగా జన గణన చేయాలని కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. నవంబర్ 15 నుంచి కులాల వారీగా జన గణన చేయాలని ఆదేశాల జారీ చేయడం పట్ల బీసీ కులాలు హర్షం వ్యకం చేస్తున్నాయని తెలిపారు. సిఎం జగన్ చేపట్టే సామాజిక బస్సు యాత్రకు బిసి కులాలు సంఘీ భావం తెలియజేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రచారకార్యదర్శి కుళాయిప్ప అన్నయ్య జిల్లా అధ్యక్షులు పాపసాహెబ్ పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే బిఎస్‌పి లక్ష్యం

కడప అర్బన్ : బహుజన సమాజ్ పార్టీ జిల్లా ముఖ్య కార్యకర్తల విస్తృత సాయి సమావేశం జిల్లా అధ్యక్షులు జయరాం అధ్యక్షతన నగరంలోని యుటిఎఫ్ భవనంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గౌరవనీయులు బక్క పరంజ్యోతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ ఆర్జె మలికల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికామే లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. బహుజనలందరూ కలిసికట్టుగా బహుజన సమాజ్ పార్టీని బలపరచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బహుజనులకు ఎటువంటి రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేయలేదని తెలిపారు. 2024 ఎన్నికల్లో జిల్లాలో 7 నియోజకవర్గాలలో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థులను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించడం ద్వారా రాజ్యాధికారంలో బహుజనుల, ఆత్మగౌరాన్ని నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గుర్రప్ప మాట్లాడుతూ కాన్సిరాం, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఓటు హక్కు ద్వారా నా బడుగు బలహీన వర్గాల ప్రజలు రాజులవుతారని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ 'రాచమల్లు'


- ప్రొద్దుటూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ వైసిపి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అని ఆ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను కాకీ, ఖద్దరు కలిసి అంతం చేయాలని రాచమల్లు వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నాలుగున్నర సం వత్సరాలుగా నిద్రపోయారా అని ప్రశ్నించారు. జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై నాలుగు రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఎస్పీని కలిసి వినతి ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, ఇసుక రవాణా బిగ్ బాస్ రాచమల్లు అని చెప్పారు. ఎస్పీ రాచమల్లు నివాసంలో సిసి పుటేజీలు పరిశీలిస్తే ఎవరెవరు ఆయనను కలిసింది బట్టబయలు అవుతుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులు రాచమల్లు ఆయన నివాసంలో విందు ఇచ్చి, ఇక ఆరు నెలలు కార్యకలాపాలను నిలిపేయాలని, ఎన్నికల అనంతరం తిరిగి కొనసాగిస్తామని చెప్పారన్నారు. అక్రమార్జనకు వ్యక్తులను వాడుకుని వదిలేయడం రాచమల్లు నైజంగా చెప్పారు. ఏరి, కోరి సిఐగా వేయించుకున్న ఇబ్రహీం ను బదిలీ చేయించి, బాలస్వామి రెడ్డిని డిఎస్‌పిగాబాధ్యతలు స్వీకరింప చేయిస్తే, రాచమల్లు అసాంఘిక కార్యకలాపాల గుట్టు రట్టవుతుందన్నారు. ఆయనపై ఆయన పార్టీ నుంచి వ్యతిరేకత మొదలైందని పేర్కొన్నారు. రాచమల్లు ఇక మాజీ ఎమ్మెల్యే అవుతారని జోష్యం చెప్పారు.

ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాలు

ప్రజాశక్తి- ఒంటిమిట్ట



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా

మండలంలోని కుడ ములూరు వద్ద సోమశిల వెనుక జలాల పంపు హౌస్ నుంచి ఒంటిమిట్ట చెరువుకు రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి ఆదివారం నీటిని విడుదల చేశారు. ముందుగా ఆయన స్థానిక నాయకులతో కలిసి పూజలు నిర్వహించి పంప్ హౌస్ వద్ద బటన్ నొక్కారు అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంపు హౌస్ మరమ్మతు కోసం కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తీసుకెళ్లామన్నారు. ఆయన చొరవ తీసుకొని ఒంటిమిట్ట పంపు హౌస్ రిపేరు కోసం రూ. 50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. మరలా రెండో పైపు లైన్ రిపేర్ కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో మంజూరైన వెంటనే త్వరగా పనులు పూర్తి చేస్తామన్నారు. రబీని దృష్టిలో ఉంచుకుని నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల వైసిపి ప్రజా ప్రతినిధులు సర్పంచులు, అధ్యక్షులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

రసవత్తరంగా హ్యాండ్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని డిఎస్ఎ క్రీడామైదానం వేదికగా 9వ ఎపి హ్యాండ్‌బాల్ సీనియర్ మహిళలు, అండర్-19 బాలుర విభాగం ఛాంపియన్‌షిప్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లను హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కె. చిన్నపరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచి వెంకటసుబ్బయ్య స్మారకంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ విజయవంతంగా సాగుతోందన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వి. శివప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు నిర్వహించారు. **హోరాహోరీగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు** హ్యాండ్‌బాల్ అండర్-19 విభాగంలో నిర్వహించిన పూల్ మ్యా చ్‌లో కడప జట్టు తూర్పుగోదావరి జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జట్టు శ్రీకాకుళంపై, శ్రీకాకుళం జట్టు తూర్పుగోదావరి జట్లుపై విజయం సాధించాయి. ఇంకో మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జట్టు కడప జట్టుపై, చిత్తూరు జట్టు ప్రకాశం జట్టుపై, వైజాగ్ జట్టు కృష్ణాజట్టుపై, విజయనగరం జట్టు కర్నూలుపై విజయం సాధించాయి. అనంతరం నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో విజయనగరం జట్టు గుంటూరుపై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. సీనియర్ మహిళల విభాగంలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో విజయనగరం, కృష్ణా జట్లు తలపడగా, కృష్ణాజట్టు విజయం సాధించి సెమీస్‌కు చేరింది.



విజేతలతో హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు చిన్నపరెడ్డి

పెండింగ్ పనులు వేగవంతం

- రూ.28 కోట్లతో కాల్వ పనులు పరుగులు
- కుందూ-పెన్నా ఎత్తిపోతలతో ఆయకట్టు స్థిరీకరణ
- తెలుగుగంగ ప్రాజెక్ట్స్ సూపరింటెండెంట్ డి.వెంకటరామయ్య

బ్రహ్మంసాగర్ పెండింగ్ పనులు వేగవంతం చేస్తాం. రూ.28 కోట్ల తో బ్రహ్మంసాగర్ కెనాల్ మరమ్మతు పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించాం. దీంతో 1.56 లక్షల పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. ఇందులోభాగంగా కుడి, ఎడమ కాల్వల పనుల్ని వేగవంతం చేశాం. ఎడమ కాల్వ పనుల్లో పురోగతి కని పిస్తోంది. ఇందుకుగానూ జిబిసి, ఓబిసి పనుల్లో కదలిక నేపథ్యంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నంద్యాల-కడప జిల్లా సరిహద్దు ప్రాంతంలోని 98 కి.మీ నుంచి 108 కి.మీ వరకు కాల్వల పనుల్ని పూర్తి చేస్తే పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందించే అవకాశాలు ఉంటాయని పేర్కొంటున్న తెలుగుగంగ ప్రాజెక్ట్స్ సూపరింటెండింగ్ ఆఫీసర్ ఇ.వెంకటరామయ్యతో ముఖాముఖి...

ప్రజాశక్తి - కడపప్రతినిధి



ముఖా ముఖి..

బ్రహ్మంసాగర్ నిల్వ సామర్థ్యం ఎంత?

17 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం 5.8 టిఎంసిలు నిల్వ ఉంది. కుందూ-పెన్నా ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే ఆయ కట్టు పూర్తిస్థాయిలో స్థిరీకరణకు అవకాశం ఉంటుంది.

బ్రహ్మంసాగర్ ఆయకట్టు విస్తీర్ణమెంత?

బ్రహ్మంసాగర్ కింద 1.56 లక్షల విస్తీర్ణం ఉంది. ఇందులో 40 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. మిగిలిన ఆయకట్టు ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 రిజర్వాయర్లు, ఎడమ, కుడి కాల్వల పరి ధిలో ఉంది. ఇందులో జిబిసి, ఓబిసి కెనాల్ ప్రాంతాల్లో పెండింగ్ పనుల్ని పూర్తి చేయడంపై ఆధారపడి ఉంది.

సాగర్ ఆయకట్టు వివరాలు తెలపండి?

బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో బ్రహ్మంసాగర్ ఆయకట్టు విస్తరించి ఉంది. మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బద్వేల్ నియోజ కవర్గంలోని బద్వేల్, పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, గోపవరం, అట్లూరు మండలాలున్నాయి.

పెండింగ్ పనుల పురోగతి ఎలా ఉంది?

బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాల్వల్లోని జిబిసి, ఓబిసి ప్రాంతా ల్లోని అక్కడక్కడా ఉన్న పెండింగ్ పనులు వేగవంతం చేశాం. ఇందులో భాగంగా ఓబిసి ప్రాంతాల్లోని పెండింగ్ పనుల్ని చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడంతో పనులు పట్టాలకు ఎక్కించాం. జిబిసి కాంట్రాక్టర్ ముందుకొస్తే 50 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. ఇందులోభాగంగా జిబిసి కింద 20 వేల ఎకరాలు, ఓబిసి కెనాల్ ప్రా ంతంలో 10 వేల ఎకరాలు వెరసి 30 వేల ఎకరాల ఆయకట్టు అందుబా టులోకి రానుంది.

లైనింగ్ పనుల పరిస్థితి ఏమిటి?

బ్రహ్మంసాగర్ కుడి కాల్వ 15 కిలోమీటర్లు, ఎడమ కాల్వ 58 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రూ.9.7 కోట్లతో ఎడమ కాల్వ లైనింగ్ పనుల్లో 50 శాతం పురోగతి కొనసాగుతోంది. నాలుగు దఫాలుగా పిలి చిన టెండర్లలో జెకె కన్స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టును దక్కించుకుని పనులు చేపడుతోంది. రూ.10 కోట్లతో కుడి కాల్వ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో 700 మీటర్ల అక్విడక్టు పనులు చేపడితే అట్లూరు మండలంలో ని ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది.

లీకేజీ మరమ్మతు ఎంతవరకు వచ్చింది?

బ్రహ్మంసాగర్ లీకేజీ పనులకు రూ.57 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. లీకేజీ ప్రాంతాల్లో 36 ఫిల్లర్లను ఏర్పాటు చేయడమైంది. ఇక్కడి నుంచి ముందుకు వెళ్లడానికి పోలవరం అథారిటీ నిపుణుల నుంచి అందే సూచనలు, సలహాలను బట్టి ముందుకు వెళతాం. దీంతోపాటు మరో 100 మీట ర్లలో చెమ్మ తగిలిన ప్రాంతాన్నీ గుర్తించడమైంది. గ్రౌటి ంగ్ ప్రక్రియ సహాయంతో చెమ్మను అరికట్టే ప్రయత్నాలు చేపట్టాల్సి ఉంది.

కుందూ-పెన్నా లిఫ్టు పనుల గురించి చెప్పండి?

కుందూ-పెన్నా ఎత్తిపోతల పనులు పురోగతిలో ఉన్నాయి. 56 ఎకరాల భూసేకరణ అనంతరం ఎత్తిపోతల పనులు ఊపందుకునే అవ కాశం ఉంది. లిఫ్టు పనులను పూర్తి చేసిన అనంతరం ఎనిమిది టిఎంసి లను ఎత్తిపోసే అవకాశం ఉంది.

సర్‌ప్లస్ గేట్ ఏర్పాటు ఎప్పుడు?

బ్రహ్మంసాగర్ సర్‌ప్లస్ గేట్ సెంట్రల్ డిజైనింగ్ ఆఫీసర్స్ సర్వే చేసి ప్రతిపాదనలు పంపించాం. డ్రాయింగ్ సెక్షన్ నుంచి అప్రూవల్ లభించాల్సి ఉంది.

పండ్ల తోటల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పండ్ల తోటల రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న తాడిపత్రిలో అరటి, చీనీ, బొప్పాయి, మామిడి, నిమ్మ రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు, వైరస్‌తో దెబ్బతిన్న అన్ని పండ్ల తోటలకు సమగ్ర పంటల బీమా ద్వారా రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని తెలిపారు. పండ్ల తోటల రైతులకు డ్రిప్, స్పింక్లర్లు గతంలో లాగా 90 శాతం సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. మామిడి బత్తాయి అరటి పండ్ల తోటల రైతులకు మద్దతు ధర నిర్ణయించాలని పేర్కొన్నారు. మార్కెట్ సౌకర్యం కల్పించి దళారుల దోపిడీ నుంచి పండ్ల తోటల రైతులను కాపాడాలని కోరారు. పండ్ల తోటలకు అనుబంధంగా జ్యూస్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, మామిడి టమోటా వంటి ఉద్యాన పంటలను నిలువ చేసుకునేందుకు అన్ని మండల కేంద్రాలలో శీతల గిడ్డంగులను నిర్మించి రైతు లకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. మామిడి, అరటి, బత్తాయి వంటి పంటలకు ఎగుమతి అనుమతించాలని కోరారు. పండ్ల తోటల రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19వ తేదీ తాడిపత్రి పట్టణంలో రాష్ట్రస్థాయి సదస్సును కడప జిల్లాల పండ్ల తోటల రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కరపత్రాల ఆవిష్కరణలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, నాయకులు చిన్న, సిద్దయ్య, శికామణి పాల్గొన్నారు.

భవిష్యత్తులో ఐక్యంగా ముందుకు వెళదాం

కడప అర్బన్ : బలిజలు భవిష్యత్తులో ఐక్యంగా ముందుకు వెళదామని బలిజ ఉద్యోగుల ఆత్మీయ కలయికలో నాయకులు నిర్ణయించారు. ఆదివారం రామచంద్రయ్య కాలనీలో కాప్స్ రాక్స్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న బలిజ ఉద్యోగులు తోటి ఉద్యోగులకు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఉద్యోగ అవకాశాల గురించి ఎప్పటికప్పుడూ తెలియజేయాలని కోరారు. బలిజ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొవ్వూరు మస్తాన్ రాయల్, నాయకులు పుట్టా సుబ్రమణ్యం, సమ్మెట సత్యనారాయణ, ఉమ్మడి కడప జిల్లా కేఆర్ అడ్మిన్స్ పాల్గొన్నారు.

ఎడాపెడా పెంచిన విద్యుత్ ఛార్జీలు : కాంగ్రెస్

కడప : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరుతో పెద్ద ఎత్తున అదనపు భారాలు మోపుతున్నదని సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే విద్యుత్ బారాలను, అదనపు చార్జీలను వెనక్కి తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ డిమాండ్ చేశారు.కడప నగరంలోని పలు నివాస గృహాల వద్ద ఆదివారం యూత్ కాంగ్రెస్ నాయకులు కరెంటు బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు సామాన్య ప్రజలకు రోజురోజుకూ భారం అవుతున్నాయని పెంచిన కరెంటు బిల్లుల ద్వారా ప్రజానికం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులో కనీస వినియోగ ఛార్జీలు రూ. 270 అయితే రకరకాల భారాలు కలిపి రూ. 756 వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజానీకం ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని తక్షణమే విద్యుత్ బిల్లులో విధించిన అదనపు ఛార్జీలు వసూలును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రొద్దుటూరు అధ్యక్షులు వంశీ యాదవ్, పులివెందుల అధ్యక్షుడు కోమటి శ్రీ సాయి, యూత్ కాంగ్రెస్ నాయకులు మంజునాథ రెడ్డి, గణేష్, సుమంత్ కుమార్, అశ్విత్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

పోరుమామిళ్ల టౌన్ : పట్టణంలో దసరా పండుగ పురస్కరించుకొని అంగరంగ వైభవంగా,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి మహోత్సవాలు ఈనెల 15 నుండి 25 వరకు వైభవేతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాజులపల్లి శ్రీనివాసులు,కార్యదర్శి, కోశాధికారి యాదాల రమేష్ బాబు, ఇతర కమిటీ సభ్యులు తెలియజేశారు. ఉత్సవాలలో మొదటి రోజైన ఆదివారం ఆర్యవైశ్యులు మంగళ వాయిద్యాలతో కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి శాల దగ్గర నుండి గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వరకు వచ్చి మంగళ వాయిద్యాలతో ఆలయంలోకి ప్రవేశించి ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు.



విద్యాసామగ్రి అందజేస్తున్న తౌహీద్‌ఖాన్, అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆరిఫుల్లా

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలామ్

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రజ్ఞుడు ఎపిజె అబ్దుల్ కలాం అని అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు, ఆడిటర్ పఠాన్ తౌహీద్ ఖాన్ అన్నారు. ఆదివారం కలామ్ 93వ జయంతి సందర్భంగా నగరంలోని బిసి బాయ్స్ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు పుస్తకాలు, క్యాలిగ్రఫీ పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. ముఖ్య అతిథిగా విద్యాసాధన విద్యాసంస్థల డైరెక్టర్, చాంద్ బీ ఛారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ లయన్ పి.మన్సూర్ అలీ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రజ్ఞుడు, యువతకు మార్గనిర్దేశకుడు, జీవితాంతం దేశ ప్రతిష్ట కోసం తపించిన దేశ భక్తుడు అబ్దుల్ కలామ్ అన్నారు. సంస్థ అధ్యక్షుడు తౌహిద్ ఖాన్ మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ మన మధ్య లేకపోవడం చాల బాధాకరమైన విషయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ కలామ్ సేవా సమితి సభ్యులు శరన్ కుమార్, సూర్య, ఆర్డీఎస్ ఫౌండర్ జోసెఫ్, మీకోసం సేవా సంస్థ ఫౌండర్ విష్ణు వర్ధన్, సఖీ ఫౌండేషన్ ఫౌండర్ రహమతున్నీసా, జావీద్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న మన్సూర్ అలీ ఖాన్, తౌహిద్ ఖాన్

జీవితమంతా శాస్త్రవేత్తగా, విద్యావేత్తగా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన ఆదర్శప్రాయుడు, రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చిన మహనీయుడు, భారతరత్న, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని ఎఎస్ఎస్‌హెచ్‌ఆర్‌సి ఎపి స్టేట్ చైర్మన్ బుచ్చుర్ ఆరిఫుల్లా, ఎస్ఎస్ జెఐసి సిహెచ్‌ఆర్‌సి వ్యవస్థాపకుడు షా మహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం మాజీ భారత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. యువత అబ్దుల్ కలామ్ స్ఫూర్తితో పయనించినపుడే దేశం శాస్త్ర రంగంలో అభివృద్ధి చెంది వసుధైక కుటుంబంలా వర్ధిల్లుతుందన్నారు. **వేంపల్లె :** భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దార్శనికుడు, స్ఫూర్తి ప్రదాత, మార్గ దర్శకుడని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆదివారం వేంపల్లెలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, ఉత్తన్న, రామకృష్ణ, నరసింహరెడ్డి, బద్రి, బాలం సుబ్బరాయుడు, రాఘవయ్య పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్తు

పోరుమామిళ్ల టౌన్ : విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవరచుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాసీంవల్లి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ తెలిపారు. సెలవురోజుల్లో విద్యార్థులను గ్రంథాలయానికి తీసుకురావడం ఎలా? అన్న అంశాన్ని ఛాలెంజ్ గా తీసుకొని వరుసగా ఐదవ ఆదివారం సైతం విద్యార్థులను గ్రంథాలయానికి వచ్చేలా జె వివి నాయకులు ఖాసీం వల్లి కృషి చేశారు. గ్రంథాలయ అధికారి ఆఫ్రిది సహకారంతో విద్యార్థులకు కథలు, దేశ నాయకుల జీవిత చరిత్రలు, తదితర పుస్తకాలు చదివిస్తున్నారు. ఈ సందర్భంగా ఖాసీం వల్లి మాట్లాడుతూ విద్యార్థులు భారత రత్న ఎ. పి. జె అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత విద్యావంతులై ఉత్తమ శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులచే కథలు, మహానుభావుల జీవితచరిత్రలు చదివించి, వారు తాము చదివిన విషయాలు మాట్లాడించారు. ప్రతిభ చూపే విద్యార్థులకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తామని ఖాసీం వల్లి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు రంగనాయకులు, మున్నా , ప్రసాద్, ఖదీర్ బాష పాల్గొన్నారు.


మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే.. : ఎంపిపి

చెన్నూరు : ప్రతి ఒక్కరూ చేతులను పరి శుభ్రంగా ఉంచుంటుకే ఆర్యోగం వారి వెంటే ఉంటుందని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ డే (ప్రపంచ చేతులు పరి శుభ్రపరచుకునే దినోత్సవం) గౌరవ మండల పరిషత్ అధ్యక్షులు చెన్నూరు వారి ఆధ్వర్యంలో చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కనీసం రోజులో నాలుగైదు సార్లు చేతులను సబ్బుతో కనీసం 10 సెకన్లు కడుక్కోవడం వల్ల అనేక రకాల జబ్బుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు చెప్పారు. ఈ విషయాల పైన ప్రతి ఒక్కరికి అవగాహనా కల్పించాలని అయన తెలియ జేశారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని సంజీవరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి శివమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.5 లక్షలు ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి అంద జేశారు. సంజీవరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి శివమ్మ భర్త ఇరగంరెడ్డి వీర భాస్కర్‌రెడ్డి లివర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల హైదరాబాద్ ఆస్పత్రిలో మరణించారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి దిక్కుతెలియని పరిస్థితిలో ఉండగా, విషయాన్ని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థికసాయం వచ్చేలా చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తిరుపాల్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరలక్ష్మిరెడ్డి, జొన్నవరం వీరారెడ్డి పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి

దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దసరా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, చండీ పారాయణం, అమ్మవారికి పంచా మృతాభిషేకం నిర్వహించారు. రాత్రి రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు

పులివెందుల రూరల్ : పట్టణంలోని బంగారు బజారులో ఉన్న శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారిశాలలో దసరా శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమైనట్లు ఆలయ అధ్యక్షులు కొత్త రవికుమార్ తెలిపారు. ఆదివారం రాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు ప్రజలకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పట్టణంలోనే మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త రవికుమార్ దంపతులు కలశం చెంబు చేబూని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యాయానికి ఇంకెన్నాళ్లు సంకెళ్లు

ప్రజాశక్తి - చాపాడు

న్యాయానికి ఇంకెన్నాళ్లు సంకెళ్లు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి వి.వంనిశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టులో భాగంగా మైదుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యా దవ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అయ్యవారిపల్లె గ్రామంలో ఆది వా రం న్యాయానికి సంకెళు పేరిట వినూత్న నిరసన కార్రక్రమాన్ని నిర్వహిం చా రు. చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అయ్య వారి పల్లె సర్పంచ్ కె.రహంతుల్లా, ఉప సర్పంచ్ నాగన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంకెళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి శ్రేణులు

ఎర్రగుంట్ల : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి ఆదేశాల మేరకు ఎర్రగుంట్ల పార్టీ కార్యాలయం వద్ద టిడిపి శ్రేణులు సంకెళ్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో సుంకర నాగేశ్వరరావు, సేట్, సంజీవరెడ్డి, బాషా, టైలర్ మాబు, శివారెడ్డి, కొండారెడ్డి, సూరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, సీనియర్లను జూనియర్లు ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా రాణించాలని మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక చెర్లోపల్లె రోడ్డులోని సాహిత్య డిగ్రీ కళాశాలలో మూడవ, రెండవ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. యువత కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి ఎదుగుతారని, చదువుతోపాటు స్వయం ఉపాధి కోర్సులను చదవాలని సూచించారు. కళాశాల యాజమాన్య ప్రతినిధులు సంజీవరెడ్డి, సాయిరాంరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతగానో కృషి చేస్తుందని, తమ కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నతస్థాయిలో నిలిచారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు.


డిఎల్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఆదివారం చిలమకూరులో ఎంపిడిఒ రంతుల్లయ్య ప్రజలకు, విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. లేదంటే చేతులపై ఉన్న మురికి తినే పదార్థం ద్వారా శరీరంలోనికి ప్రవేశించి రోగాలపాలవుతామన్నారు. ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా పంచాయితీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

- పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఆదివారం ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలో కొట్టం స్కూల్ ఆవరణలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ వసంత్ ఆధ్వర్యంలో ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్, స్వయం సహాయక సంఘం సభ్యులకు ప్రపంచ చేతుల పరిశుభ్ర దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చేతులు శుభ్రత ప్రాముఖ్యత గురించి వివరించారు. ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మెప్మా సిఒ వసంత్, ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్స్, స్వయం సహాయ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి 17న నియోజకవర్గ పర్యటనలో భాగంగా బి.కొత్తకోట, పిటిఎం మండలాలకు వస్తున్నారని వైసిపి పలమనేరు నియోజకవర్గ పరిశీలకులు పాగొండ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. రెండు మండలాల్లో పూర్తయిన సచివాలయాలు ,రైతు భరోసా కేంద్రాలు, జగనన్న కాలనీ, వెల్నెస్ సెంటర్లను ప్రారంభిస్తారన్నారు. అంతేకాకుండా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. మండలాల్లోని వైసిపి నాయకులు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, నాయకులు, హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఆపదలో పేదలకు ఆపన్న హస్తం

'కటికరెడ్డి' సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ ప్రదానం



అంబులెన్స్ ప్రారంభిస్తున్న మధుసూదనరెడ్డి (ఫైల్ ఫొటో)


డాక్టరేట్‌ను అందుకున్న మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల నాయకులు, సమాజ సేవకులు కటికరెడ్డి మధుసూదనరెడ్డి సమాజ సేవ చేస్తూ సేవా గుణానికి సన్నిధిగా.. పేదల పాలిట పెన్నిధిగా నిలిచినందుకు తమిళనాడు యూనివర్శిటీ గుర్తించి ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించింది. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆపదలో అండగా నిలిచి ప్రజలకు చేయూత నిస్తున్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగలకు తన సొంత డబ్బులతో నిత్యావసర సరుకులు, చికెన్, కూరగాయలు, బహుమతులు అందజేస్తూ ఆపన్న హస్తం అందిస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఆయన కుమారుడు యువనేత గుణవంత్ రెడ్డి పనులు లేక అవస్థలు పడుతున్న 4వేల మందికి కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేసి పేదల ఆకలిని తీర్చారు. మాజీ మంత్రి ఆది నారాయణరెడ్డి సహకారంతో కటికరెడ్డి కుటుంబం తరపున ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రత్యేక వైద్య నిపుణులతోపాటు తన ఇద్దరు కుమార్తెలు డాక్టర్ సంఘవీరెడ్డి, డాక్టర్ లిఖితారెడ్డి తన తమ్ముడు కటికరెడ్డి సుధాకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డితో మండల ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లలేని స్థితిలో ఉన్న భాదితుల కోసం అత్యవసర వేళల్లో సకాలంలో వైద్యశాలకు తరలించేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేశారు. చనిపోయిన తర్వాత భౌతిక కాయాన్ని ఉంచేందుకు బాడీ ఫ్రీజర్ బాక్స్, శవాన్ని తరలించేందుకు వైకుంఠ రథం, స్మశానంలో శవాన్ని పూడ్చేందుకు గుంత తీసేందుకు జెసిబి ఉచితంగా అందుబాటులో ఉంచారు. తన తల్లిదండ్రులు కటికరెడ్డి రామసుబ్బారెడ్డి, ఓబులమ్మ జ్ఞాపకార్థం ప్రయాణికులు కూర్చునేందుకు బస్టాప్ నిర్మించారు. అంతేకాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు కూర్చునేందుకు కుర్చీలు వితరణ చేశారు. తన కుటుంబ సభ్యుల పుట్టినరోజు వేడుకలకు అనాథాశ్రమంలో అన్నదానం చేస్తారు. దేవాలయాలు, చర్చిలు, మసీదుల అభివృద్ధికి ఆర్థిక పరమైన తోడ్పాటనందిస్తారు. నాలుగేళ్లుగా తన సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవ కోసం వెచ్చిస్తున్నారు. తన సేవలను మరింత విస్తృతం చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు కటికరెడ్డి మధుసూదనరెడ్డి.

సమాజ సేవ చేయడంలో ఆత్మ సంతృప్తి

సమాజంలోని పేద ప్రజలకు, అనాథలకు సేవ చేయడంలో మనసుకు ఎంతో ఆత్మ సంతృప్తి ఉంది. అభాగ్యులు, నిరాశ్రయుల కోసం ఎందరో మహానుభావులు పాటుపడ్డారు. వారిని ఆదర్శంగా తీసుకుని తనవంతు సాయంగా ప్రజలకు సేవ చేస్తున్నా. పేదల ఆకలి తీర్చడం మనసుకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడంలో కటికరెడ్డి కుటుంబం ముందు ఉంటుంది. భవిష్యత్తులో సేవలు మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తాను.

- డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి, సమాజ సేవకులు


హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబసభ్యులు

దసరాకు పటిష్ట భద్రత

పది రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు : ఎఎస్‌పి ప్రేరణ్‌కుమార్


మాట్లాడుతున్న ఎఎస్‌పి ప్రేరణ్‌కుమార్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

దసరా ఉత్సవాలకు ప్రొద్దుటూరులో పటిష్ట పోలీస్ భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎఎస్‌పి ప్రేరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక అనిబిసెంట్ పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం ఆమె పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు పటిష్టపోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం నుండి ఈనెల 23వరకు నవరాత్ర ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలుగకుండా పోలీస్ శాఖ తరపున అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణంలోని ప్రతి కూడలిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆలయాల వద్ద పోలీస్ కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామన్నారు. భక్తులు క్యూ పాటించేలా కమిటీ సభ్యులతో చర్చించి చర్యలు తీసుకున్నామన్నారు. 5 మంది సిఐలు, 15మంది ఎస్ఐలు, 63 మంది ఎఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 233 మంది కానిస్టేబుళ్లు, 25మంది మహిళా కానిస్టేబుళ్లు, 92మంది హొంగార్డులు, 6సెక్షన్ల సాయుధ బలగాలు, 100 ఎన్‌సిసి క్యాడెట్ల సేవలను బందోబస్తులో వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జేబుదొంగలు, చిల్లర దొంగలు సంచరించే అవకాశం ఉందన్నారు. పోలీసులతోపాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ట్రాఫిక్ మళ్లించిన విషయాన్ని సమగ్రంగా వివరించారు. సమావేశంలో సిఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణ యాదవ్, యుగంధర్, రమణారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో వెన్నెముకను ఆరోగ్యంగా ఉంచుకోవాలి

నేడు ప్రపంచ వెన్నముక దినోత్సవ సందర్భంగా ప్రజాశక్తితో డాక్టర్ కదిరి వెంకటేశ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మాటమీద నిలకడలేని మనిషిని వెన్నెముకలేని వ్యక్తిగా పేర్కొనడం సమాజంలో అప్పుడప్పుడు వింటూంటాం. అంటే మనిషి శరీరాన్ని నిటారుగా నిలబెట్టగలిగేది.. మన పనులను సక్రమంగా పూర్తి చేసుకునేందుకు సహకారం అందించేది వెన్నెముక. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వెన్నెముక మన శరీరంలో అత్యంత ముఖ్యమైంది. సున్నితమైంది కూడా. ఏ చిన్న గాయమైనా ప్రాణం విలవిల్లాడిపోతుంది. అత్యంత ముఖ్యమైన వెన్నెముక ఆరోగ్యంగా ఉండాలంటే మనం తీసుకునే పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని ప్రముఖ వెన్నెముక చికిత్స నిపుణులు డాక్టర్ కదిరి వెంకటేశ్ తెలిపారు. సోమవారం ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వెన్నెముక సమస్యను వెంటనే గుర్తించలేం. కాబట్టి ముందు నుంచి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెడ, ఛాతీ, నడుము భాగం శరీరాన్ని నిలబెట్టే భాగాలు. వీటిని వర్టిబ్రల్‌కాలం అంటారని తెలిపారు. ఎముకలు బలంగా ఉంచుకునేందుకు కృషి చేస్తే వెన్నెముక బాగుంటుందన్నారు. మేనరిక వివాహాల వల్ల పుట్టుకతోనే కొంత మందికి వెన్నెముక సమస్య ఉంటుం దన్నారు. 35 సంవత్సరాల అనంతరం గర్భం దాల్చిన ప్పుడు కొంతమందికి, వంశపారంపర్యంగా మరి కొంతమందికి పుట్టుకతోనే వెన్నెముక సమస్య ఉంటుందని డాక్టర్ తెలిపారు.



ప్రమాదాలు జరిగినప్పుడు వెన్నెముక పైభాగం దెబ్బతింటే కాళ్లు స్పర్శను కోల్పోతాయన్నారు. ఇలాంటి ప్రమాదాల వల్ల కాళ్లు చేతులు కదలిక కోల్పోవడంతోపాటు ఒక్కో సారి ప్రాణాపాయం కూడా సంభవిస్తుందన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో పైనుంచి కింద పడిన వేళల్లో వెన్నెముకపై ప్రభావం చూపింది అని గుర్తించినప్పుడు ఆ వ్యక్తిని ఎలాంటి కదలికలకు గురిచేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. 40-60 సంవత్సరాల మధ్య వారికి నడుములో వత్తుకుంటే దీని ప్రభావం కాళ్ల సలుపుతాయి.. దీన్ని సయాటిక్ అంటాం. మెడబాగంలో వత్తుకంటే చేతులు సలుపుతాయి. దీన్ని బ్రేకియాల్జియా అంటాం. నడుము కాలినొప్పి వస్తే స్పాండైలోలిస్తసిస్ అంటాం అన్నారు. టి.బి., బ్యాక్టీరియా ప్రభావం వల్ల కూడా వెన్నెముక సమస్య వస్తుందన్నారు. 60సంవత్సరాలు దాటిన మహిళలకు ఎముకలు బలహీన పడిపోతాయని, దాంతో ఎముకలు వంకర తిరుగుతాయన్నారు. కాళ్లు సలుపు తాయన్నారు. వృద్ధ పురుషులకు కూడా ఇలాంటి సమస్య వస్తుందన్నారు. పోషకాహారం ద్వారా ఎముకల సాంద్రత పెంచుకోవాలన్నారు.

తల ఒకవైపునకు తిప్పి మొబైల్ చూడడం, అతిగా మొబైల్ గేమ్స్ ఆడడం వల్ల వెన్నెముక నొప్పి వస్తుందన్నారు. ఫ్లాట్ చెప్పులు తొడగాలన్నారు. తప్పుడు భంగిమలో కూర్చొన్నా తుంటిపై భారం పడుతుందన్నారు. ప్రతి అరగంటకోసారి కదుల్తూ ఉండాలన్నారు. తలగడ ఎత్తుగా పెటుకో కూడదన్నారు. నిద్రించే స్థలం బల్లపరుపుగా ఉండాలన్నారు. నడిచే సమయంలో ఇబ్బందిగా ఉండడం, మూత్రవిసర్జన సమస్య రావడం, కాళ్ల భుజాలు కదిలించేందుకు ఇబ్బందిగా ఉండడం మొడ భాగంలో తీవ్రమైన నొప్పి లక్షణాలుగా తెలిపారు. నేలమీద నుండి బరువులు ఒకేసారి ఎత్తకుండా అంచెలంచెలుగా ఎత్తాలి. వీపు ఆనుకొని కూర్చొవాలి. బాణంలాగా నిల్చోవడం, రెండు కాళ్లు ఛాతీకి ఆనించడం, తుంటిని దొర్లిం చడం, అదిమిపెట్టి పైకి లేవడం వంటి తేలికపాటి నడుము వ్యాయామాలు చేయాలన్నారు. మెడ, భుజం వ్యాయామాలు కూడా చేయాలని ఆయన సూచించారు. పౌష్టికాహారం, నిర్దేశించిన విధంగా వ్యాయా మాలు చేయడం ద్వారా వెన్నెముకను ఆరోగ్యంగా ఉంచుకోవాలని డాక్టర్ కదిరి వెంకటేశ్ తెలిపారు.

రైతులకు రాయితీతో పివిసి పైపులు

- ఒక్కో రైతుకు రూ.10 వేల రాయితీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజవర్గంలోని రైతులకు ప్రభుత్వం శుభవార్తను ప్రకటించింది. కొన్నేళ్లుగా వాటర్ క్యారీయింగ్ పైపులను(పివిసి) ప్రభుత్వం రాయితీతో ఇవ్వడం లేదు. ఇటీవల కాలంలో బోరు బావుల్లో నీరు సమృద్ధిగా ఉన్నాయి. అయితే ఆ నీటిని తరలించడానికి ఉపయోగపడే పివిసి పైపులు ప్రభుత్వం రాయితీతో ఇవ్వకపోవడంతో బయట మార్కెట్లో పైపులను కొనుగోలు చేయలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో వ్యవసాయ శాఖ, పులివెందుల నియోజవర్గ డెవలప్‌మెంట్ అథారిటీ సంయుక్తంగా రైతులకు రాయితీతో పైపులు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నాయి. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని రైతులకు 9వేల పైచిలుకు యూనిట్లను మంజూరు చేశారు. ఒక్కో రైతుకు గరిష్టంగా ఒక హెక్టార్‌కు పరిమితి విధించారు. అదేవిధంగా ఒక్కో రైతుకు రూ.10వేల రాయితీ లభించనుంది. ఇందులో రెండు, రెండున్నర, మూడు ఇంచుల పైపులు ఇవ్వనున్నారు. 63 ఎంఎం పైపులు 45కు పూర్తి ధర రూ.20,250కాగా రాయితీ పోనూ రూ.10,250, 75 ఎంఎం 30 పైపులకు పూర్తి ధర రూ.20,400కాగా, రాయితీ పోనూ రూ.10,400, 90ఎంఎం 25 పైపులకు పూర్తి ధర రూ.21,000కాగా రాయితీ పోనూ రూ.11వేలు, 110ఎంఎం 20 పైపులకు పూర్తి ధర రూ.22,560కాగా రాయితీ పోనూ రూ.12,560 రైతు వాటా కింద చెల్లించాల్సి ఉంది.


రైతులు కోరుకుంటున్న పివిసి పైపులు

త్వరలోనే దరఖాస్తులను ఆహ్వానిస్తాం

రైతుభరోసా కేంద్రాల ద్వారా అర్హతగల రైతుల నుంచి త్వరలోనే దరఖాస్తులను తీసుకుంటాం. ఒక్కో రైతుకు ఒక హెక్టార్‌కు మాత్రమే రాయితీ ఉంటుంది. ఈ అవకాశాన్ని అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- శివమోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి

చోరీ కేసులో అంతర్రాష్ట్ర నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ద్విచక్రవాహనాలను చోరీ చేసే అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కె.కేశప్ప తెలిపారు. ఆదివారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎస్‌పి బి.కృష్ణారావు ఆదేశాల మేరకు మదనపల్లె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, సిఐ ఎస్.మహబూబ్ బాషాకి రాబడిన సమాచారంపై ఎస్ఐ సి.హరిహర ప్రసాద్, సిబ్బంది కలిసి మదనపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ముందు బెంగళూరులో రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు మూడు ద్విచక్ర వాహనాల్లో పోలీసులను చూసి వెనక్కు వెళ్లే ప్రయత్నం చేశారన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వారు వివిధ ప్రాంతాలలో వివిధ కంపెనీలకు చెందిన 22 మోటార్ సైకిల్ ను పెద్దమనుషుల సమక్షంలో స్వాధీనం చేసుకోవడం జరిగిందని, వాటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఉపాధ్యాయుడు డి.కె.చదువులబాబును ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గుంటూరులోని శిల్పారామంలో ఎ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర డి.కె.చదువులబాబును అబ్దుల్ కలాం జయంతి పురస్కారంతో ఎపి రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖా మంత్రి ఆర్.కె.రోజా, శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, శాసన మండలి సభ్యులు టి.కల్పలతారెడ్డి, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, అధికార భాషా సంఘం సభ్యులు మస్తానమ్మ, తవ్వా వెంకటయ్య ఘనంగా సన్మానించారు.


సన్మానం అందుకుంటున్న డి.కె.చదువులబాబు

నేడు పెద్దగురువలూరులో ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పెద్ద గురువలూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌బికె, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఎంపిపి టి.లక్ష్మయ్య తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి హాజరవుతారన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. చాపాడులోని వైఎస్ ఫంక్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి తెలిపారు. మండల పరిధిలోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

శతాధిక గ్రంథకర్త 'కొడవలూరు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కొడవలూరు రామచంద్రరాజు శతాధిక గ్రంథకర్త అని కథారచయిత కాశీవరపు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. కొడవలూరు రామచంద్రరాజు జయంతి వేడుకలను ఆదివారం బిసి ప్రజాచైతన్య సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కొడవలూరు చిత్రపటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య మాట్లా డుతూ కొడవలూరు రాసిన మహాసేనోదయం కావ్యం మహాప్రభంధమని, మనుచరిత్రకు తీసిపోని గ్రంధమని ప్రశంశించారు. కవి విమర్శకుడు పవన్ కిషోర్ రాజు మాట్లాడుతూ కొడవలూరు సాహిత్యంపై భాస్కర పుల్లయ్య పిహెచ్‌డి చేశారని, ఆ గ్రంధాన్ని ప్రింట్ చేస్తామని ఆయన పేరుమీద సాహి త్యపీఠం ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఒక పద్యకవికి అవార్డు ఇస్తామన్నారు. కవి నటుడు కొత్తపల్లి శీను మాట్లాడుతూ కొడవలూరు ప్రొద్దుటూరు పట్టణానికి వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో గజ్జల వెంకటేశ్వరరెడ్డి రామచంద్రరాజు, బాలగంగాధర తిలక్, కొత్తపేట రంగయ్య పాల్గొన్నారు.



కొడవలూరుకు నివాళులర్పిస్తున్న సాహితీ అభిమానులు

గుండె ఆపరేషన్‌కు రూ.10 లక్షల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని 13వ వార్డుకు చెందిన చెప్పలి షేక్ సలీం బాషా గుండె ఆపరేషన్ నిమిత్తం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సిఎం సహాయ నిధి కింద రూ.10లక్షలు అందజేశారు. ఆదివారం ఆయన తన నివాసంలో బాధితుడికి చెక్కును అందించారు. సలీంబాషా గుండె ఆపరేషన్‌కు దాదాపు రు.50 లక్షల ఖర్చవుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజాకి తెలియజేయగా, వెంటనే ఆ విషయాన్ని శాసనసభ్యులు రాచమల్లు దృష్టికి తీసుకెళ్లారు. 24 గంటల్లోపే రూ.10 లక్షల ఎల్‌ఒసి తెప్పించి ఇచ్చారు. అవసరమైతే తాను కూడా కొంత ఆర్థికసాయం అందజేస్తానని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


ఎల్‌ఒసి అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

శిల్పారామంలో అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆదివారం శరన్నవరాత్రారంభం, వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీ సూర్య, సూర్య డ్యాన్స్ అకాడమీ, మదనపల్లి వారి శిష్య బృందంచే జనపదం, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు సూర్యకుమార్, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

గుండెపోటుతో విఆర్‌ఎ సంఘం మండల అధ్యక్షులు సిద్ధయ్య మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

మండలంలోని సోమిరెడ్డిపల్లె విఆర్‌ఎ సిద్దయ్య(55) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. గుండె నొప్పి రావడంతో 108 సాయంతో ఆసుపత్రికి తీసుకెళుతుండగా మైదుకూరు సమీపంలో ఆయన మృతి చెందారు. ఆయనకు అయిదు మంది సంతానం. సిద్దయ్య విఆర్‌ఎ మండలశాఖ అధ్యక్షులుగా ఉంటున్నారు.



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - గాలివీడు

ప్రతి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా వాడాలని ఎస్ఐ వెంకట శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం గేటు పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహన దారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విలువైన ప్రాణాన్ని రక్షించు కోవాల్సిన బాధ్యత మనపైన ఉందన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించడం ద్వారా ప్రాణాన్ని రక్షించు కున్న వారు అవుతారని పేర్కొన్నారు. వాహనాల లైసెన్సు, రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. చిన్నపిల్ల లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. అలా ఇచ్చి ప్రమాదాలకు గురైతే తల్లిదండ్రులపై కేసునమోదు చేస్తామన్నారు. అతివేగంతో ద్విచక్రవా హనాలు నడిపి ప్రాణాలను కోల్పోవద్దన్నారు. చాలా మంది యువత అతివేగంతో వాహనాలు నడిపి ప్రాణాలను పోగొట్టు కొని తల్లిండ్రులను శోకసంద్రంలోకి నెట్టేస్తున్నారని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వాహనాలు జాగ్రత్తగా నడపాలని సూచించారు.


సూచనలు ఇస్తున్న ఎస్ఐ శివకుమార్